
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శుక్రవారం 28 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:30 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4:54 (శనివారం ఉదయం)



ఇల్లంతకుంటలో చివరి దశలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు



వేములవాడలో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు

డబుల్ ఆశలు..

- 'ఇందిరమ్మ'కు తోడుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లపై సర్కారు దృష్టి
- అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు నిధులు
- జిల్లాలో 6,886 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు
- పనులు ప్రారంభమైనవి 4,248.. అసంపూర్తిగా మిగిలినవి 702..
- ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు 1,07,398..
- జిల్లాలో మొదటి దశలో 1,085 మంది అర్హుల గుర్తింపు..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పథకానికి శ్రీకారం చుట్టింది. దశలవారీగా పేదల సొంతింటికలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా సర్వేచేసి గ్రామసభలు నిర్వహించారు. తొలివిడత నిర్మాణాలకు గ్రౌండింగ్ పక్రియ మొదలైంది. ఇదేక్రమంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లనిర్మాణాల్లో కొన్ని అసంపూర్తిగా మిగిలిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని కూడా ప్రభుత్వం పూర్తిచేసి ఇందిరమ్మ ఇళ్లతో పాటు లబ్ధిదారులకు అందించే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన 702ఇళ్ల నిర్మాణాలు పూర్తికానున్నాయి. మరోవైపు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గత ప్రభుత్వ హయాంలో 3,448 మంది లబ్ధిదారులకు అందించారు. ఇప్పటివరకు రూ.188. 49 కోట్లు ఖర్చు చేశారు. పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకాలనీల్లో లబ్ధిదారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మురికి కాలువలు, తాగు నీరు, వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని భావించినా ప్రభుత్వం మారడంతో ఆచరణలోకి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించనున్న నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

● జిల్లాలో 3,546 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలకు సంబంధించి 6,886 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరుచేశారు. ఇందుకోసం రూ.374.41 కోట్ల నిధులు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 5,437 ఇళ్లకు మాత్రమే టెండర్ పక్రియ పూర్తిచేశారు. 4,248 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి 3,546 ఇళ్లు పూర్తిచేశారు. ఇందులో 3,448 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. రూ.188.49 కోట్లు ఖర్చు చేశారు. 702 ఇళ్లు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. కొన్నిఇళ్లు దాదాపు పూర్తయినా మౌలిక సదుపాయాలు లేక పంపిణీకి నోచుకోవడం లేదు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా అనేక వివాదాల మధ్య అందించడం లేదు. పూర్తయిన ఇళ్లు కేటాయింపులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో సిరిసిల్ల మండలంలో 2,052 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తిచేశారు. ముస్తాబాద్‌లో 702 ఇళ్లకు 429, తంగళ్లపల్లిలో 549 ఇళ్లకు 110, ఎల్లారెడ్డిపేటలో 490ఇళ్లకు 320, గంభీరావుపేటలో 476ఇళ్లకు 371, వీర్నపల్లిలో 160ఇళ్లు మంజూరుకాగా 50ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఒక్కటి కూడా పూర్తికాలేదు. ఇల్లంతకుంటలో 340 ఇళ్లకు 184 పూర్తిచేశారు. వేములవాడరూరల్ మండలంలో 1,080ఇళ్లకు 80ఇళ్లు పూర్తికాగా, వేములవాడ అర్బన్‌లో 800 ఇళ్లకు ఇప్పటివరకు ఒక్కటి కూడా పూర్తికాలేదు. కోనరావుపేట మండలంలో 92, చందుర్తిలో 45, రుద్రంగిలో 35, బోయినపల్లిలో 65ఇళ్లు మంజూరైనా ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభం కాకుండానే లబ్ధిదారుల్లో నిరాశ నింపింది. ప్రధానంగా వేములవాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లనిర్మాణం పూర్తిగా నిరాశనే కల్పించింది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే సగం కూడా పూర్తి కాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మంజూరైన ఇళ్లలో ఇప్పటివరకు ప్రారం భం కాని ముస్తాబాద్‌లో 175ఇళ్లు, తంగళ్లపల్లిలో 178, ఎల్లారెడ్డిపేటలో 106, గంభీరావుపేటలో 43, వీర్నపల్లిలో 87, ఇల్లంతకుంటలో 156, వేములవాడ రూరల్‌లో 1000, వేములవాడ అర్బన్‌లో 656, కోనరావుపేటలో 92, చందుర్తిలో 45, రుద్రంగిలో 35, బోయినపల్లిలో 65ఇళ్లు టెండర్లు పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మా ణాలపై నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం అవుతోంది.

ఇందిరమ్మ ఇళ్లకు లక్షకు పైగా దరఖాస్తులు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు 1,07,398 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అర్హులను గుర్తించడానికి డిసెంబరు, జనవరిలో సర్వే చేశారు. గ్రామసభలు నిర్వహించారు. తాజా బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయింపుల్లోనూ ఆశలు కల్పించింది. జిల్లాలో మొదటి విడతగా మూడు...

మిగతా 8లో



గౌన్యా నాయక్ తండాలో అసంపూర్తిగా ఉన్న వంతెన

నిధులు సరిపోవు.. నిర్మాణాలు పూర్తికావు..

- అసంపూర్తి వంతెనలతో తప్పని అవస్థలు
- పట్టించుకోని పాలకులు

7

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

- సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెల్లడించిన డీఆర్‌పీలు

8



తనిఖీ వేదికలో పాల్గొన్న అధికారులు

రేపు ముందస్తు ఉగాది కవి సమ్మేళనం

సిరిసిల్ల రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఉగాది కవి సమ్మేళనాన్ని ఈనెల 29న విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థలో ముందస్తు కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని మానేరు రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీవి నారాయణ, అడెపు లక్ష్మణ్, కార్య నిర్వహణ అధ్యక్షుడు ఎలగొండ రవిలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కవి సమ్మేళనంలో కవులు, సాహితీ అభిమానులు, కళాకారులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులుగా డాక్టర్ కందేపీ రాణీప్రసాద్, ముఖ్యఅతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, రచయిత జూకంటి జగన్నాథంలు పాల్గొంటారని తెలిపారు.

భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోనరావుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మల్కపేట రిజర్వాయర్ ద్వారా ఊర చెరువు నుంచి అందులో కోల్పోయిన భూములకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా ఊర చెరువు నింపడం వల్ల అందులో మునిగిపోయిన భూములకు నష్టపరిహారం అందించాలని కోరుతూ ఆర్డీవో రాజేశ్వర్‌కు కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మల్కపేట రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా ఊర చెరువును నింపుతున్నారని, ఆ చెరువు నిండడం వల్ల భూములు మునిగిపోతున్నాయని, అందులో మునిగిపోయిన భూములకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మల్కపేట బాధిత రైతులు ఆనందం, నారాయణ, శేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

సిరిసిల్ల క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కోర్టు అడ్వకేట్స్(బార్) అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ అనంతరం అధ్యక్ష స్థానానికి ఆవునూరి రమాకాంత్‌రావు, జూపల్లి శ్రీనివాసరావు, వెల్మల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి స్థానానికి తంగళ్లపల్లి వెంకటి, జువ్వాజి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ గాజుల రాజమల్లు, జి. శశాంకం, మహిళా ప్రతినిధి స్థానానికి ఎం.పుష్పలతగౌడ్, ఎల్లె జ్యోతి పోటీలో ఉన్నారు. మిగతా స్థానాలకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో అడ్వకేట్స్ (బార్) అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా అనిల్‌కుమార్, కోశాధికారిగా వేముల నరేశ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా నరిమెట్ల రమేశ్, గ్రంథాలయ కార్యదర్శిగా ఉచ్చిడి శరత్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు, సాయంత్రం 3గంటలకు కౌంటింగ్, ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణరావు, సహాయ ఎన్నికల అధికారి జగ్గారావులు తెలిపారు. గత వారం రోజులుగా న్యాయవాదులు పోటాపోటీగా విస్తృత ప్రచారం చేశారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి

- అధికారులు సమన్వయంతో దృష్టి పెట్టాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, పక్కన ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో దృష్టి పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశం జరిగింది. ఎస్పీ మహేష్ బీ గీతేతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కలిగించేందుకు అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా చేపట్టాలన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సంబంధించిన శాఖలు కలిసి పని చేయాలన్నారు. కళాశాలల్లో మత్తు పదార్థాల నిర్మూలన కమిటీలను కొనసాగిస్తూ విద్యార్థులు అన్ని రకాల మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన, చర్చాగోష్ఠి పోటీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, డీఎంహెచ్‌వో రజిత, ఇంటర్మీడియేట్ విద్యాధికారి శ్రీనివాస్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, డీఏవో అఫ్జల్‌భేగం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు

- ప్రజా భవన్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దని ప్రజా భవన్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ ఆదేశించారు. ప్రజా భవన్ ప్రజావాణి దరఖాస్తులు, ఎన్‌బీఎఫ్‌ఎస్ తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా భవన్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులు ఒకే అర్జీని పట్టుకొని పదే పదే రాకుండా చూడాలని ఆదేశించారు. అర్హులైన వారి సమస్యలు తప్పకుండా పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఎన్‌బీఎఫ్‌ఎస్‌పై ప్రచారం చేయాలని, అర్హులందరికీ సహాయం అందేలా చూడాలని తెలిపారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాల్సిన అవసరం ఉందని, నిర్మాణం అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. వేములవాడ పట్టణంలో మోడల్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయ సముదాయం, ఇతర పోలీస్‌స్టేషన్ల అధికారుల నివాస సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. మహిళల భద్రతను పెంపొందించేందుకు వేములవాడ పట్టణంలో మహిళా పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం అత్యవసరమని, వేములవాడ అర్బన్ మండలానికి సైతం పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని, రుద్రంగి మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలో రోడ్డు విస్తరణ, మరమ్మతులు చేపట్టాలని, మోహన్‌రావుపేట నుంచి ఈదులలింగంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, తండ్రియాల నుంచి పసునూరు మీదుగా కొత్త రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందించేందుకు రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌ల శిక్షణ కోసం దరఖాస్తులను చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ భారతి కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎన్‌ఎస్‌డీసీ, టాస్క్, ఈజీఎమ్‌ఎమ్, మెప్మా ఎన్‌ఐఎంఎస్‌ఎంఈలతో గుర్తింపు పొందిన లేదా అనుసంధానమైన వృత్తి శిక్షణ సంస్థలు డ్యూకీ, పీఎంకెవై, పీఎం కేవీవై, పీఎం కేకే, కేంద్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాల కోసం 9949910328 లో సంప్రదించాలని కోరారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత

సిరిసిల్ల టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీలకు(మిడ్‌లెవల్ హెల్త్‌ప్రొవైడర్) గ్రామస్థాయిలో ప్రజలకు అందించే ఆరోగ్య సేవలపై సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఐదు సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, ఓరల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్, టీబీ వ్యాధితో బాధపడే వారి వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు అంజలినా ఆల్ఫ్రెడ్, సంపత్‌కుమార్, రామకృష్ణ, అనిత, డీడీఎం కార్తిక్, డీపీవో రాజేందర్ పాల్గొన్నారు.

ఫామ్ ఎఫ్ రికార్డులు సరిగ్గా ఉండాలి

- పీవోఎంహెచ్‌ఎన్ డాక్టర్ అంజలినా ఆల్ఫ్రెడ్



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

సిరిసిల్ల టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ సెంటర్లలో ఫామ్ ఎఫ్ రికార్డులు సరిగ్గా ఉండాలని పీవోఎంహెచ్‌ఎన్ డాక్టర్ అంజలినాఆల్ఫ్రెడ్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అనుసరించి స్కానింగ్ సెంటర్లలో రికార్డులు, స్టాఫ్, రేడియాలిస్టుల పేర్లు, ధరల పట్టికను తెలుగులో ఆయా బోర్డులను నిర్వాహకులు ఏర్పాటు చేయాలన్నారు. తనిఖీలలో డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్‌ఈ బాలయ్య, ఎన్జీవో అధ్యక్షుడు చింతోజు భాస్కర్ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతి


సమ్మయ్య (ఫైల్)

సైదాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామశివారులోని మొలంగూర్‌రోడ్‌లో గురువారం ట్రాక్టర్‌టైర్ కిందపడి డ్రైవర్ పొల్లు దాసరి సమ్మయ్య(57) మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన పొల్లుదాసరి సమ్మయ్య అదే గ్రామానికి చెందిన ఓవ్యక్తి ట్రాక్టర్‌లో లోడ్ వేసుకొని సైదాపూర్ నుంచి మొలంగూర్‌వైపు వెళ్తున్నాడు. ట్రాక్టర్‌ను లోలెవల్ వంతెన వద్ద ఆపి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అంతలోనే ట్రాక్టర్ చిన్నచిన్నగా కదులుతుండడంతో దానిని ఆపేందుకు సమ్మయ్య ప్రయత్నిస్తూ ట్రాక్టర్ ఎక్కబోయాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి ట్రాక్టర్ పెద్ద టైర్‌కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మంథనిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన మీసాల రాకేష్ (32) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రాకేష్ సోమవారం ఉదయం గడ్డి మందుతాగి ఇంటికి రాగా కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం మంథనికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందాడు. రాకేష్ ఆత్మహత్యకుగల కారణాలు పూర్తిగా తెలియరాలేదు.

అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య

అంతర్గాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు తాళలేక తాటిపల్లి పద్మ(40) అనేగృహిణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినసంఘటన గురువారం రామగుండం పట్టణంలోని సీ కాలనీలో చోటుచేసుకుంది. రామగుండం ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపిన వివరాలప్రకారం జెన్‌కో ఉద్యోగి అయిన తాటిపల్లి కృష్ణమూర్తి కుటుంబం రామగుండం సీ కాలనీలో నివాసముంటున్నారు. కృష్ణమూర్తి భార్య పద్మ కొన్నిసంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో భర్త ఇంట్లో లేని సమయంలో పద్మ వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్‌ఐ పంచనామా నిర్వహించి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

లారీ ఢీకొని విద్యార్థులకు తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బైపాస్ రహదారిలోని ముష్టిపల్లి చౌరస్తాలో గురువారం లారీ ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. కోనరావుపేట మండలంలోని మల్కాపేట గ్రామానికి చెందిన ఉత్కం అజయ్, నీరటి భరత్‌లు సిరిసిల్లలోని కళాశాలకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతుండగా బైపాస్ రహదారిపై వెంకటాపూర్ వైపు నుంచి వేములవాడకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా లారీని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

● ఒకరికి తీవ్రగాయాలు

జైపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం చెక్‌పోస్టు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో కారు యాజమానికి తీవ్ర గాయాలైనట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా నుంచి మట్టి లోడుతో వస్తున్న లారీ ఇందారం చెక్‌పోస్టు సమీపానికి రాగానే రహదారిపై లారీ ఆగిపోయింది. గోదావరిఖనికి చెందిన రేణికుంట్ల దత్తమూర్తి తన కారులో మంచిర్యాలకు వస్తుండగా ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాల య్యాడు. సంఘటన స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయాలపాలైన దత్తమూర్తి గోదావరిఖని ఎన్టీపీసీలోని అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉంటాడని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

తాడిచెట్టుపై నుంచి పడి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తాడిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని మంగపేటలో చోటుచేసుకుంది. గురువారం గ్రామానికి చెందిన తాళ్లపెల్లి శంకర్‌గౌడ్ (55)తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా తలకు, చేతులకు, నడుముకు గాయాలు కాగా పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బుర్ర సదానందంగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నరసయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

భవనంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనంపై నుంచి పడి ఈశ్వర్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఆసుపత్రి ఆవరణలోని క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు చేస్తున్న మేస్త్రీ ఈశ్వర్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా కాంట్రాక్టర్ రక్షణచర్యలను పాటించకపోవడం వల్లనేప్రమాదాలకు గురవుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ గురువారం గాయపడ్డారు. ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు కాగా పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు సుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు సంపత్‌ను మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

వేములవాడ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం నందికమాన్ శివారులో ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీంతో సదరు వృద్ధురాలిని చికిత్సనిమిత్తం ఏరియాఆసుపత్రికి తరలించారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు

శంకరపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్‌లో కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన ఇనుకొండ మల్లారెడ్డి అతని భార్య శ్రీలత భూతగదాల విషయంలో సదయ్యను కులం పేరుతో దూషించారన్నారు. ఈ మేరకు సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

వరికి మొగి పురుగు

● మందులు స్ప్రేచేసినా తగ్గని ఉధృతి ● దిగుబడిపై ఆందోళనలో రైతులు


సారంగాపూర్ మండలంలో మొగి పురుగు ఆశించిన వరి పంట, వరి పైరును చూపుతున్న రైతు

సారంగాపూర్, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పంటకు మొగి పురుగు ఆశించింది. ఈ సీజన్‌లో మండలంలో 10,800 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. బోర్లు, బావులు, చెరువు ఆయకట్టు కింద అధిక మొత్తంలో రైతులు వరినే పంటనే సాగు చేశారు. వరికి సోకిన మొగి పురుగు నివారణ కోసం రైతులు రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేశారు. అయినా పురుగు ఉధృతి తగ్గకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు తీవ్ర ఆందోళన చెందతున్నారు. మండలంలో రెండు వ్యవసాయ క్లస్టర్లు ఉండగా సంబం ధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు ఇచ్చినా సందర్భాలు లేవని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో మొత్తం 11 ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా కొందరు యజమానులు నాణ్యతలేని మందులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి రైతులకు నాణ్యమైన పురుగు మందులను అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

మందుల కోసం వేలు ఖర్చు చేశా

దేశరాజుల మధు, రైతు, బట్టపెల్లి

ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంటను సాగు చేశా. పంటలో మొగి పురుగు నివారణ కోసం వేలల్లో ఖర్చు చేసి రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేశా. అయి నా మొగి పురుగు ఉధృతి మాత్రం తగ్గలేదు. మొగి పురుగు ప్రభావంతో ఊస పోయింది. దిగబడి తగ్గుతుందని ఆందోళనగా ఉంది.

నారు మడిలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మండల వ్యవసాయ అధికారి, ప్రదీప్‌రెడ్డి

నారు మడి నుంచే సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే మొగి పురుగును నివారించవచ్చు. నాటు వేసే ముందు నారు కొనలను తుంచి నాటు వేసినట్లయితే వరిలో మొగిపురుగు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఫర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు చేపట్టి నాణ్యతలేని మందులు అమ్మిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

వైన్స్‌లో చోరీకి యత్నం

శంకరపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పులో కొంత భాగం తొలగించి లోపలికి దూరారు. విద్యుత్‌సరఫరా నిలిపివేసి, ఇన్వర్టర్లు ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వీడీఆర్‌బాక్స్‌తోపాటు రెండు బీరుసీసాలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కొత్తపల్లి రవి, క్లూస్ టీమ్ సీఐ బృందం సభ్యులతో సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించి సంఘటనపై విచారణ చేపట్టారు.

రత్నాపూర్‌లో ఎక్సైజ్ దాడులు

రామగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాతీ పరిధిలోని రామగిరిఖిల్లా ప్రాంతంలో నాటుసారాయి తయారీ చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు గురువారం ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లంపానకంను ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మహేందర్, శ్రీను, శ్యామ్, రవిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి27(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బిస్కు సత్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఈనెల 26న రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న గంగయ్యను బిస్కు సత్యం తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన అతన్ని మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారని తెలిపారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన బాధితుడి బావమరిది కర్రోళ్లమల్లేశ్ ఫిర్యాదుతోకేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం మెయిన్ గేట్ వద్ద కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించగా ముగ్గురు వ్యక్తుల వద్ద 1 కిలో 180 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బైక్‌పై ముగ్గురుయువకులు పారిపోయే యత్నం చేశారని, వారిని అదుపులోకి తీసుకుని సోదాచేయగా గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు బీహార్ రాష్ట్రానికి చెందినవారిని వీరి ప్రస్తుత నివాసం అశోక్‌నగర్ అని తెలిపారు. నీరజ్‌కుమార్(20), సోరుకుమార్(19), దిలేందర్ కుమార్(29)లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, రాజన్న, హెడ్‌కానిస్టేబుల్ బషీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేర రూ. 57. 13లక్షల మోసం

● అద్దె అకౌంట్‌తో లావాదేవీలు ● అకౌంట్ అద్దెకు ఇచ్చిన మహారాష్ట్ర విద్యార్థి అరెస్టు



కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.57.13 లక్షలు మోసపోయాడు. గత ఏడాది జరిగిన ఈ సంఘటనలో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు ఆకర్షితుడైన గోదావరిఖనికి చెందిన వ్యక్తికి మాయ మాటలు చెప్పి సైబర్ నేరగాళ్లు ఉచ్చు బిగించారు. మహారాష్ట్రకు చెందిన ఒక విద్యార్థి అకౌంట్‌ను అద్దెకు తీసుకుని సైబర్ నేరగాళ్లు గోదావరిఖనికి చెందిన వ్యక్తి నుంచి రూ.57.13 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. బాధితుడు గత ఏడాది నవంబర్ 1న రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని డీఎస్‌పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయిన అకౌంట్ హోల్డర్ మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లా నవవాడి గ్రామానికి చెందిన శుభం నవనాథ్ శెల్కే(20) అనే విద్యార్థిదిగా గుర్తించారు. అతడిని విచారించగా తాను టెలిగ్రామ్ యాప్‌లో పరిచ యమైన ఒక వ్యక్తికి తన అకౌంట్‌ను నెలకు రూ.5వేలకు అద్దెకు ఇచ్చినట్టు పేర్కొన్నాడు. అకౌంట్ అద్దెకు ఇచ్చిన విద్యార్థి శుభం నవనాథ్ శెల్కేను గురు వారం అరెస్టు చేసినట్టు సైబర్ క్రైమ్ డీఎస్‌పీ వెంకటరమణ పేర్కొన్నారు. ప్రజలు ఎవరూ కూడా ఆన్‌లైన్ గేమ్‌లు, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్లు లోన్‌యాప్‌లు, డిజిటల్ అరెస్టు, మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ, ఫెడెక్ కొరియర్ ఫ్రాడ్ పేర వచ్చే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు.

అర్ధరాత్రి నర్సింగాపూర్‌లో హంగామా

● యూట్యూబ్ యువతులపై దాడి

చందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఓ పాట చిత్రీకరణ కోసం వచ్చిన యూట్యూబ్ ఛానల్‌యువతులపై ముగ్గురువ్యక్తులు మద్యం మత్తులో హంగామాచేసి దాడిచేశారు. ఈ ఘటన మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట వివిధ ప్రాంతాలకు చెందిన యువతులు మండలంలోని మూడపల్లి గ్రామంలోని బండపై ఒక పాటను చిత్రీకరించారు. రాత్రి కావడంతో విడిది కోసం నర్సింగాపూర్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం చేసిన అనంతరం ఇంటిముందు కూర్చుని పాటలు వింటున్నారు. గ్రామానికి చెందిన గంగాధర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులువచ్చి తాము పోలీసులమంటూ బెదిరించారు. పది నిమిషాల్లో ఇక్కడ నుంచి ఖాళీచేసి వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు పాల్పడడంతో, వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో గ్రామానికిచెందిన వ్యక్తులు, యువతులపై దాడిచేయడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించినట్లు యువతులు పేర్కొన్నారు. దీంతో 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని యువతులకు రక్షణ కల్పించేందుకు వేములవాడకు తరలించారు. ఈ సంఘటనపై జగిత్యాల రూరల్ మండలంలోని సోమన్‌పల్లికి చెందిన గుగ్గిళ్ల జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నక్క గంగాధర్, పెరుక శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

హుజూరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం సూపర్‌బజార్‌లోని మంజునాథ జ్యూవెలర్స్‌లో వెండి ఆభరణాలు దొంగతనం చేసిన ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంజునాథ జ్యూవెలర్స్‌లో ఆభరణాల కొనుగోలు పేరుతో గుర్తుతెలియని ఇద్దరు మహిళలు వెండి పట్ట గొలుసులు దొంగలించారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాళ్లను గుర్తించి వారికోసం పోలీసులు గాలిస్తుండగా హుజూరాబాద్ బస్టాండ్‌లో వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి దొంగలించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు.

అనుమతిలేని ఇటుక బట్టీలపై విచారణ


విచారణ జరుపుతున్న ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బటీలపై ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. అనుమతి లేని ఇటుక బట్టీలపై స్థానికులు, కాంగ్రెస్ నాయకుడు రాకేష్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి గురువారం ఇటుక బట్టీల వద్దకు వెళ్లి విచారణ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడితో పాటు, ఇటుక బట్టీల వ్యాపారులతో విచారణ చేపట్టారు.వారంరోజుల్లో అనుమతిపత్రాలు సమర్పించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీవో వ్యాపారులకు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 400 రేక్‌ల యూరియా రవాణా


400రేక్‌కు జెండా ఊపుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రైల్వే మార్గం ద్వారా 400రేక్‌ల యూరియాను రవాణా చేసినట్టు ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స చెప్పారు. గురువారం 400రేక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నాటికి 400రేక్‌లను తెలంగాణకు పంపినట్టు, ఆర్ఎఫ్‌సీఎల్ దేశంలోనే వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి రైతులకు సరసమైన ధరలో యూరియాను ఆర్ఎఫ్‌సీఎల్ అందిస్తుందన్నారు. పౌరులకు ఆహార భద్రత కల్పించేందుకు ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 11.70లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రవాణా చేశామన్నారు. యూరియా రవాణాకు కీలక పాత్ర పోషించిన కార్మికులకు కేంద్ర రసాయనాల, ఎరువుల మంత్రిత్వశాఖకు, వాటాదారులకు, రైల్వే అధికారులకు, తెలంగాణ పరిపాలనశాఖ అధికారులకు ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స కృతజ్ఞతలు తెలిపారు.

మహిళను వేధించిన యువకుడి అరెస్టు



బోగరి విజయ్‌కుమార్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన యువకుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సుందిళ్ల గ్రామానికి చెందిన బోగరి విజయ్ కుమార్ కొంత కాలంగా గోదావరిఖని గంగానగర్‌కు చెందిన ఓ మహిళను వేధిస్తున్నాడు. మహిళతో ఫోన్‌లో మాట్లాడిన మాటలను రికార్డు చేసి మహిళను వేధిస్తున్నాడన్నారు. ఎవరైనా మహిళలు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడడం, ఫొటోలు షేర్ చేయడం, మెసేజ్‌లు చేయరాదని, సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసి గ్రూపుల్లో పోస్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొండగట్టులో పారిశుధ్య లోపం


మెట్లపై లేని రక్షణగోడ

● గదుల వద్ద మురుగు నీరు
● కూలిపోయిన వసతి గదుల మెట్ల రక్షణ గోడ
● పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం వద్ద పారిశుధ్య లోపంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి సమీపంలో ఉన్న మారుతి నిలయం వసతి సముదాయం పక్కనే గల హోటల్ నుంచి వ్యర్థపు నీరు బయటికి వచ్చి వసతి గదులు మెట్ల వద్ద చేరి దుర్వాసన వస్తోంది. దీంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. వ్యర్థపు నీటిని మురుగుకాలువలోకి తరలించాల్సి ఉండగా మెట్ల పైనే పైపుల నుంచి వ్యర్థపు నీటిని వదు లుతున్నారు. దుర్వాసనతో పాటు చెత్తతో కూడిన నీరు మెట్లపై ఉండడంతో భక్తులు గదులలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం భక్తులకు శాపంగా మారింది. అవే మెట్లపై నుంచి కొంచెం ముందుకు వెళ్లగా మెట్ల రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మెట్ల నుంచే భక్తులు గదులలోకి వెళ్లేటపుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


మెట్లపై హోటల్‌నుంచి వస్తున్న నీరు

ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలల పునరుద్ధరణకు అవకాశం

తిమ్మాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) గుర్తింపు పొంది, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అనుబంధం రద్దయిన ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలలు తిరిగి అనుబంధం పొందుటకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అవకాశం ఇచ్చిందని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తిగల ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలల యాజమాన్యాలు 2025-26నుంచి 2028-2029 విద్యాసంవత్సరానికి పునరుద్ధరణకు పూర్తిస్థాయి ప్రతిపాదనలను ఈనెల31లోగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణమండలి (ఎస్‌సీఈఆర్‌టీ) సంచాలకులు, హైదారాబాద్ వారికి సమర్పించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కున్న కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో ఈ నెల 22న రాత్రి జరిగిన ఘటనలో నిందితుడు హుస్సేనిపురకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను అరెస్టు చేశామని కరీంనగర్ మూడోఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌రూరల్ మండలం చేగుర్తికి చెందిన సత్తు నరేందర్ గాంధీ చౌరస్తా వద్ద ఉండగా ఒక వ్యక్తి ఆటోలో వచ్చి నరేందర్‌ను బెదిరించి నెట్టివేసి సెల్‌ఫోన్ బలవంతంగా తాక్కెళ్లాడని తెలిపారు. బాధితుడి తలకు గాయాలుకాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని సోదరుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష

కోరుట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుల కేసులో ఒకరికి ఒక సంవత్సరం కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ కోరుట్ల జెఎఫ్‌సీఎం జడ్జి పావని గురువారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్సై కథనం ప్రకారం.. కోరుట్లకు చెందిన రాముకు కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన యశోదకు 2007లో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనపు కట్నం తేవాలంటూ రాము తన భార్య యశోదను తరచూ వేధించేవాడు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 4వేల జరిమానా విధించాడు.





అడవిపదిరలో పిల్లర్లు పోసి వదిలేసిన వంతెన, అసంపూర్తిగా ఉన్న అడవిపదిర వంతెన

నిధులు సరిపోవు..

నిర్మాణాలు పూర్తి కావు

● అసంపూర్తి వంతెనలతో తప్పని అవస్థలు

● పట్టించుకోని పాలకులు

వీర్నపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణాలపై దృష్టి సారించడం లేదని విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న వంతెనలు పూర్తయి అందుబాటులోకి వస్తే వాహనదారుల ప్రయాణం సురక్షితంగా సాగుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుత్తేదారు నిర్లక్ష్యం..

వంతెనలు పూర్తిచేయకుండా వదిలేయడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడంలేదు. గుత్తేదారు కనీసం సరైన తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయక పోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. అడవి పదిరలో వానాకాలం వరి ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో రైతులు, గ్రామస్థుల సహ కారంతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. మళ్లీ యాసంగి ధాన్యం కోతకు వస్తుండటంతో సరైన రోడ్డు లేక లారీలు రావడానికి రైతులకు ఇబ్బందులు తప్పేలాలేవు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో వాగులు ఉధృతంగా వరదలు రావడంతో వంతెనలు పూర్తికాక రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పక్క గ్రామాల మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

అదనపు నిధుల కోసం ఆరాటం..

వీర్నపల్లి మండలంలో అడవిపదిర, బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామాల పరిధిలోని హైలెవల్ వంతెనలు నిధులు సరిపోక నిర్మాణాలు ఆగిపోయాయి. అడవిపదిర గ్రామంలో రూ.2కోట్ల ఎమ్ఆర్ఆర్ గ్రాంట్ నిధులతో వంతెన నిర్మాణ పనులు చేపట్టి పిల్లర్లు పోసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామ పరిధిలోని గోన్యా నాయక్ తండాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో వంతెన పనులు చేపట్టి అప్రోచ్‌రోడ్డు, సైడ్‌వాల్ నిర్మాణాలు ఆగిపోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. వంతెన నిర్మాణాలు పూర్తయ్యేందుకు అదనపు నిధులు అవసరం ఉందని ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. అప్రోచ్ రోడ్లకు, స్లాబ్ పనులకు అదనపు నిధులు మంజూరయితే వంతెన పనులు పూర్తయి ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. పాలకులు, ఉన్నతాధికారులు మారుమూల అటవీ గ్రామాలపై దృష్టి పెట్టి అసంపూర్తి వంతెనలను పూర్తిచేసి ప్రజల అవస్థలను తొలగించాలని కోరుతున్నారు.



గొన్యా నాయక్ తండాలో అసంపూర్తిగా ఉన్న వంతెన



రెండేళ్లు దాటినా వంతెన పూర్తికాలేదు..

జాలపల్లి మనోజ్ కుమార్, అడవిపదిర

గ్రామంలో వంతెన నిర్మాణం చేపట్టి రెండేళ్లు దాటినా పనులు పూర్తికాలేదు. కనీసం కాంట్రాక్టర్ తాత్కాలిక రోడ్డు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థుల సహకారంతో ఒకరోజు నిరాహార దీక్ష చేసినా ఫలితం లేదు. పాలకులు, అధికారులు పట్టించుకుని వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.



ప్రతిపాదనలు పంపాం..

శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈఈ

అడవిపదిర, గోన్యా నాయక్ తండాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హైలెవల్ వంతెనలకు నిధులు సరిపోక అసంపూర్తిగా ఆగిపోయాయి. ప్రభుత్వానికి అదనపు నిధుల కోసం నివేదికలను పంపించాం. నిధులు మంజూరు కాగానే వంతెనల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదం

● ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మల్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనం టాప్‌పై కూర్చున్న ఇద్దరు గురువారం ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఇందులో సాయికృష్ణ (17) అనే బాలుడు మృతిచెందగా సంపంగి ప్రేమ్‌చంద్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన శివరాత్రి లింగయ్య కుటుంబసభ్యులు, బంధువులతో గురువారం అంజనేయస్వామిని దర్శించుకొని ట్రాలీ ఆటోలో తిరుగుపయనం అవుతుండగా ప్రమాదం జరిగింది. ఘాట్‌రోడ్డు దిగుతుండగా వాహనం టాప్‌పై లింగయ్య కొడుకు సాయిక్రిష్ణ, సంపంగి ప్రేమ్‌చంద్ కూర్చున్నారు. భారీ వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్ సాయిక్రిష్ణకు తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వాహనం టాప్‌పై కూర్చున్న సాయిక్రిష్ణ, సంపంగి ప్రేమ్‌చంద్ కిందపడ్డారు. వారిపై నుంచి అదే వాహనం వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతి చెందాడు. కాగా లింగయ్య కుటుంబం బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని గురువారం కొండగట్టుగా రాగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

● కిష్టునాయక్‌తండాలో విషదం..

ఎల్లారెడ్డిపేట : మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని బాలుడు శివరాత్రి సాయికృష్ణ(17) దుర్మరణం పాలయ్యాడని కుటుంబ సభ్యులు, స్థానికులు గురువారం తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని శివరాత్రి విజయ-లింగం దంపతులు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కొడుకు సాయికృష్ణ 8వ తరగతి వరకు చదువుని మధ్యలోనే ఆపేశాడు. విజయ-లింగం దంపతులు కొడుకు సాయికృష్ణతో కలిసి తన బంధువులు కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి ఆటోలో బయలుదేరారు. మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఆటోపైన కూర్చున్న సాయికృష్ణ ఒక్కసారిగా కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనితోపాటు మరోవ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సాయికృష్ణ మృతిచెందాడు. బాలుడి మృతిలో కిష్టునాయక్‌తండాలో విషాదం నెలకొంది.



సాయికృష్ణ(ఫైల్)

రాజన్న ఆలయంలో ఘనంగా మహాలింగార్చన

వేములవాడ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమం అర్చకులు ఘనంగా నిర్వహించారు ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో మహాలింగార్చన

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోరుట్ల రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షలో ఇన్విజిలేషన్ నిర్వహణలో వివాదాస్పదమైన ఉపాధ్యాయుడు నజీమొద్దీన్‌ను గురువారం జిల్లా విద్యాధికారి రాములు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మాడల్ స్కూల్‌లో జరగుతున్న పరీక్ష కేంద్రంలో అధికారులను తప్పుదోవ పట్టించి కూతురు పరీక్ష రాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేషన్ నిర్వహించడాన్ని గుర్తించి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నట్లు నరేశం తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు మరింత లోతుగా విచారిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలి



ఎస్‌యూ వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్తకార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు తరలించడం సరికాదన్నారు. వీసీ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికితీసు కెళ్తామని మరిన్ని కొత్తకోర్సులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో జల్లపల్లి అంజన్న, గంట కిరణ్మయి, పూసాల విష్ణు, బాలకృష్ణ, కార్యదర్శి సాగర్, నగర కార్యదర్శి నందు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి

● బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సమాజంలో చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని తారకరామనగర్, గాంధీనగర్ కాలనీల్లో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మీల బృందం పర్యటించింది. కాలనీలో పర్యటించి ఆయా కులాల జీవన స్థితి గతులు, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో చైర్మన్ నిరంజన్ మాట్లాడారు. చులకన భావంతో కులాలను చూడడం వల్ల ఆయా కులస్థులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి సునీత, తహసీల్దార్ వీరభద్రయ్య, కుల సంఘం నాయకులు కడారి రాజేందర్, శ్రీనివాస్, కనకయ్య, తిరుపతి, దొమ్మర కుల సంఘం నాయకులు చంద బాబు, జూపల్లి తిరుపతి, చంద రమేష్, జూపల్లి విజయ్, ముస్కు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..

బీసీ కులాల్లోని వీరముష్టి, పిచ్చకుంట్ల, దొమ్మర కులాల స్థితిగతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలను పరిష్కరింపజేస్తామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కులాల పేరు మార్పు కొరకు బీసీ కమిషన్‌కు అనేక విజ్ఞాపన పత్రాలు అందుతున్నాయన్నారు. కులాల పేరు మార్పు కొరకు ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామన్నారు. జిల్లాల పర్యటనలో పరిశీలన అనంతరం ఈనెల 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పరిస్థితిని తీసుకవెళ్తామన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో అత్యంత పేదలను గుర్తించి అందులో అర్హత కల్పించడానికి కృషి చేస్తామన్నారు.

● కులాల పేర్లను మార్చేందుకు చర్యలు..

ధర్మపురి: సమాజంలో నేటికి చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా వాటిని మార్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని దుర్గమ్మ కాలనీలో బీసీ కమీషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు దుర్గకాలనీలో దొమ్మరులు, వీరముష్టి కులస్థుల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కమీషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, ప్రత్యేక అధికారి సతీష్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి కల్పన, మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గట్టు మల్లన్న జాతర



పూజలు చేస్తున్న భక్తులు

చొప్పదండి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లెలోని గట్టుమల్లన్న జాతర వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలను నిర్వహించారు.

దేశరాజుపల్లి పల్లె దవాఖానకు ఎన్‌క్వాస్ అవార్డు



దేశరాజుపల్లి పల్లె దవాఖానా వద్ద సిబ్బంది

రామడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేశరాజుపల్లి పల్లెదవాఖానాకు ఎన్‌క్వాస్ కింద నాణ్యత సర్టిఫికెట్‌తోపాటు ఉత్తమ అవార్డు దక్కింది. నేషనల్ సిస్టం రీసోర్స్‌సెంటర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌క్వాస్ బృందం ప్రభుత్వ ఆసుపత్రులను మార్చి1న తనిఖీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 8 పల్లె దవాఖానాలకు ఎన్‌క్వాస్ నాణ్యత సర్టిఫికెట్‌తోపాటు ఉత్తమఅవార్డులకు ఎంపికచేశారు. ఇందులో రామడుగు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దేశరాజుపల్లె దవాఖానా 88.12శాతం మార్కులతో ఈ ఉత్తమఅవార్డును దక్కించుకుంది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే అవార్డు దక్కిందని మండల వైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆసుపత్రిలో కాయకల్ప బృందం

వేములవాడ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని కాయకాల్పబృందం గురువారం సందర్శించింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలను, ఆసుపత్రి పరిశుభ్రతను గురించి బృందంసభ్యులు తెలుసుకున్నారు. మూడు సంవత్సరాలుగా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందుతూ వస్తున్నది. ఈసారి కూడా అదేస్థాయిలో మార్కులు వస్తాయని ఆశిస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ పెంచలయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, డాక్టర్ అనిల్, డాక్టర్ చారి, డాక్టర్ సుభాషిణి, నర్సింగ్ సూపెరింటెండెంట్లు అంజమ్మ, సుందరి, విజయలక్ష్మి, సంజీత, బ్లోసమ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



పతకంతో విక్రమ్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే జూనియర్ జాతీయ స్థాయి జూడో పోటీలకు జిల్లాకు చెందిన ఎం విక్రమ్ కుమార్ ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా జూడో సంఘం కన్వీనర్ దామోదర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సలార్ ఈ మిలాద్ ఓవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల24న జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల జూడో పోటీల్లో పాల్గొన్న వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎం విక్రమ్ కుమార్ 100 కేజీలపై విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విక్రమ్ కుమార్‌ను జూడో సంఘ ప్రతి నిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● మూడు బైక్‌లు స్వాధీనం

● చోరీ జరిగిన గంటలోనే ఛేదన

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చోరీ జరిగిన గంటలోనే గంభీరావుపేట ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం ఛేదించారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకుని అతని వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనపర్చుకున్నారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. మండలంలోని జగదాంబ తండా గ్రామానికి చెందిన బాదావత్ గోపాల్ ఈనెల 26న రాత్రి తన కోళ్ల ఫారం వద్ద ద్విచక్రవాహనాన్ని నిలిపి గేటుకు తాళం వేసి ఇంటికి చేరుకున్నాడు. ఈనెల 27న ఉదయం కోళ్ల ఫారం వద్ద వెళ్లి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. దాంతో బాధితుడు గోపాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంతో అనుమానాస్పదంగా కనిపించిన కామారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ మున్నీరును పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించారు. గంభీరావుపేట, కామారెడ్డి పట్టణాల్లో బైక్‌లను దొంగించానని అంగీకరించాడు. వాహనాలను స్వాధీనపర్చుకుని నిందితుడు మహ్మద్ మున్నీరును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్‌ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ బాల శ్రీనివాస్‌ను ఎస్‌ఐ శ్రీకాంత్ అభినందించారు.

గురుకులం విద్యార్థికి అస్వస్థత

● కోరుట్లలో చికిత్స అనంతరం డిశ్చార్జ్

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, మార్చి, 27(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులానికి చెందిన విద్యార్థి రాపర్తి హర్ష అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి చేర్పించి చికిత్స అందించారు. గురువారం ఉదయం తరగతి గదిలో ఉన్న సమయంలో చేయి నొప్పిగా ఉందని ఉపాధ్యాయుడికి తెలపగా వెంటనే ప్రిన్సిపాల్ మాధవిలతకు సమాచారమిచ్చారు. ప్రిన్సిపాల్ వెంటనే విద్యార్థి తల్లిదండ్రులకు విషయం తెలిపిన అనంతరం కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. చీమలు కుట్టడంతో విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడని ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ విద్యార్థిని పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఇంటికి పంపించినట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. వెంటనే గురుకులంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు చేశారు. 56మంది విద్యార్థులకు స్కిన్ ఎలర్జీ, కడుపునొప్పి ఉన్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి సంక్షేమ పథకాలు

డి. రజిత, ఏపీఎం, చందుర్తి



ఆంధ్రజ్యోతి: మండలంలో మహిళా సంఘాలు ఎన్ని ఉన్నాయి. ఎంత మంది సభ్యులున్నారు?

ఏపీఎం: 19 గ్రామాల్లో 30 గ్రామసంఘాలు, 744 చిన్న సంఘాలు ఉన్నాయి. 9020సంఘ సభ్యురాలు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: మహిళా సభ్యులకు స్త్రీనిధి రుణాలు ఎన్ని కోట్లు ఇచ్చారు?

ఏపీఎం: స్త్రీనిధి ద్వారా 215 సంఘాలకు రూ.3.25 కోట్ల 25 లక్షలు ఇప్పించాం.

ఆంధ్రజ్యోతి: బ్యాంకు రుణాలు ఎన్ని సంఘాలకు, ఎంత మొత్తం ఇచ్చారు?

ఏపీఎం: బ్యాంకు లింకేజీ ద్వారా 335 సంఘాలకు రూ.38.50కోట్ల రుణాలు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: మహిళా సభ్యులకు ఎలాంటి వాటికి రుణాలు అందజేస్తున్నారు?

ఏపీఎం: పీఎంఎఫ్ఎంఈ ద్వారా 6 పిండి గిర్నీలతోపాటు ఇందిరా మహిళా శక్తి ద్వారా పెరటి కోళ్ల పెంపకం, ఈవెంట్స్ మేనేజ్మెంట్, గిఫ్ట్ ఆర్టికల్స్ ఇప్పించాం. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద న్యూఎంటర్‌ప్రైజెస్ స్కీం ద్వారా చిన్నచిన్న వ్యాపారాలకు రుణాలుఇప్పించాం.

- చందుర్తి (ఆంధ్రజ్యోతి)

బాలుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఇటీవల గడ్డి కోత యంత్రంలో చిక్కుకుని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు నిమ్మంత్తుల సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. కుడి చేయి తొలగించడంతో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. సీఎంఆర్ఎఫ్ మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు బాబు, బాల్‌రెడ్డి ఉన్నారు.

'నవోదయ'కు ఎంపిక

ఇల్లంతకుంట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన రేణుశ్రీ నవోదయలో సీటు సాధించింది. మండల కేంద్రంలోని కేరళ మోడల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న రేణుశ్రీ సీటు సాధించడంపై ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చలి వేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని స్థానిక నాయకులు, అధికారులు గురువారం ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, అంజిరెడ్డి, రమేశ్, హైమద్, రాజిరెడ్డి, సాయి, బాల్‌రెడ్డి, చంద్రయ్య, నవీన్, లక్ష్మారెడ్డి, ఎల్లం, మనోహర్, శంకరయ్య, శ్రీధరాచారి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట నాయబ్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణను మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. సంఘం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బాబా, సభ్యులు చంద్రయ్య, రేణుక పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్మాలలో ఇటీవల మృతిచెందిన ఎంద్రాల సుశీల కుటుంబ సభ్యులను సెస్ చైర్మన్ చిక్కాల రామారావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ నారాయణరావు, ప్యాక్స్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రాజారాం, రాజేందర్, సుభాష్, కిషోర్, రత్నాకర్ ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎన్ లోకేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సెర్ప్ కింద్ర నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి డీఎన్ లోకేష్‌కుమార్ కోరారు. సెర్ప్ కార్యక్రమాలపై సీఈవో దివ్యహైదరాబాద్ నుంచి గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్‌కుమార్ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 33 శాతం ఉన్న కొనుగోలు కేంద్రాలను 50శాతానికి పెంచేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. జిల్లాలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకేపీలకు బదిలీ చేయాలని, అదనపు ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలతో ప్రారంభించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ, వేయింగ్ యంత్రాలతోపాటు ప్యాడీ క్లీనర్‌లు ఇతర సామగ్రిని అందించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణను అందించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంతో గోదాముల నిర్మాణాలకు సంకల్పించారని, గోదాములు లేని మండలాలను గుర్తించి మహిళా సంఘాల ద్వారా గోదాంలను నిర్మించేందుకు స్థలాలను పరిశీలించాలని సూచించారు. స్వశక్తి మహిళా సంఘాల ద్వారా స్టీచ్చింగ్ సెంటర్‌లు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికలను తయారుచేయాలని కోరారు. డీఆర్‌డీవో శేషాద్రి, మెడికల్ సూపరిండెంట్ లక్ష్మీనారాయణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజిత, డీసీఎస్‌వో వసంత లక్ష్మీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు.

3న జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాక

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, ఐదుగురు సభ్యులు ఏప్రిల్ 3వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్ వచ్చేనెల 3వ తేదీన జిల్లాలోని వేములవాడకు సాయంత్రం 6 గంటలకు చేరుకుంటారు. వచ్చేనెల 4వ తేదీన ఉద యం 6గంటలకు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు



మాట్లాడుతున్న కెకె మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలనే బీజేపీ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో మార్కేండేయ దేవాలయం అవరణలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెకె మహేందర్‌రెడ్డి మాట్లడుతూ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కోఆర్డినేటర్ ఆవెజ్ ఖాన్, జిల్లా కోఆర్డినేటర్ చిలుక రమేష్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలో గురువారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్ సూర దేవరాజు, అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, ఎలగందుల ప్రసాద్, అల్లెపు రజనీకాంత్, వీరేశం, బదుగు లింగం, మచ్చ రాజేశం, జమాల్, బెజ్జంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి సరాఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - పోత్గల్ ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిషన్ భాగీరథ నీటి సరాఫరాలో ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. చిప్పలపెల్లి గ్రామంలో మిషన్ భగీరథ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో నీటి సరఫరాపై అధికారులను ఆరా తీశారు. నీటి అవసరం ఎంతవరకు ఉందని ఆరా తీశారు. వేసవిలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడాలని ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నామాపూర్ మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, హాస్టల్, కిచెన్, మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ సిబ్బంది రిజిష్టర్, ల్యాబ్, మందుల పంపిణీ చేసిన గది, ఇన్‌పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్ గదిని పరిశీలించారు. సర్కారు దవాఖానాల్లోనే ఎక్కువ సంఖ్యల్లో డెలివరీలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు జానకీ, ప్రేమ కుమార్, రాము, ఎండీడీవో బీరయ్య, డాక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్ట్

చందుర్తి, మార్చి 27: (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో తాజా మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేయడానికి ఖండిస్తున్ననని తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా తాజా మాజీ సర్పంచ్లను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులపై పోరాడుతున్న సర్పంచులను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌ల ఫోరం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షుడు మాట్ల మధు, రాజన్న సిరిసిల్ల జేఏసీ ప్రధానకార్యదర్శి గణప శివజ్యోతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ రమేష్, సురభి నవీన్‌రావు తదితరులను అరెస్ట్ చేసి తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబీంకర్ రాజన్న, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు.

● వీర్నపల్లి : మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లను, మహిళా మాజీ సర్పంచ్‌ల భర్తలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

● రుద్రంగి : మండల మాజీ సర్పంచ్‌లను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు. అరెస్ట్ అయినవారిలో దేగావత్ తిరుపతి, గుగులోత్ గజన్‌లాల్, గుగులోత్ మోహన్ అడ్డబోర్ తండా, గుగులోత్ మోహన్ వీరుని తండా సర్పంచ్‌లు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ వైస్ చైర్మన్‌గా ఐదేళ్ల అభివృద్ధిలో పాలుపంచుకున్న సిద్దం వేణుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల బాబు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాబు మాట్లాడారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణుపై సిరిసిల్ల బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు సిద్ధం వేణును రా అనే పదాన్ని వాడుతూ జాతీయ పార్టీని దిగజార్చుకున్నారన్నారు. తమకు మాట్లాడవచ్చు కాని అంత దిగజారలేదని, తమ నాయకుడు కేసీఆర్ తమకు నేర్పలేదని అన్నారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన కేటీఆర్‌పై చిల్లరగా మాట్లాడడం సభ్యతకాదన్నారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా తెలంగాణ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై ఒక్కసారైన పార్లమెంట్‌లో మాట్లాడలేదని డిల్లీలో ఉండాల్సిన బండి సంజయ్ కరీంనగర్ ఉంటూ గల్లీ నాయకుడిలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నో పోరాటాలలో సిద్ధం వేణు ఉన్నాడని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మీ నాయకుడు ఎక్కడున్నాడని ప్రశ్నించారు. కేటీఆర్ అడుగుజాడలో సిద్ధం వేణు నడుస్తూ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్‌గా ఐదు సంవత్సరాల పాటు అభివృద్ధిలో పాలుపంచుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో కొత్తూరు మాజీ ఎంపీటీసీ పట్నం శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవిగౌడ్, చిలువేరు చిరంజీవి, యూత్ నాయకులు గుంటి మధు, ముద్దం అనిల్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్ అమలు చేయాలి

బోయినపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మహిళా బీడీ కార్మికులకు 4 వేల రూపాయలు పెన్షన్ అమలు చేయాలని మండల కేంద్రంలో తహసీల్దార్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఎం కార్యదర్శి మూషం రమేష్, మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు జవాజీ విమల,జిల్లా కమిటీ సభ్యురాలు సూరం పద్మ, నాయకులు రామంచా అశోక్, మహిళా బీడీ కార్మికులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పల్లెల ప్రగతికి కృషి..



భూమి పూజ చేస్తున్న గోపి

ఎల్లారెడ్డిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా కేంద్ర ప్రభుత్వం పల్లెల ప్రగతికి కృషి చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో తలపెట్టిన సీసీ రహదారి నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన కృష్ణయ్య పార్టీలో చేరగా పార్టీ కండు వా కప్పి ఆహ్వానించారు. ఏకలవ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నారాయణపూర్ గ్రా మంలోని పార్టీ నాయకుడు కోనేటి సాయిలును సన్మానించారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, నాయకులు తిరుపతి, లక్ష్మారెడ్డి, నరేశ్, సుధాకర్, బుగ్గారెడ్డి, సాయిలు, సంజీవరెడ్డి, బాలగౌడ్, స్వామి, రాజు, శ్రీశైలం, లక్ష్మణ్, గణేశ్, శ్రీనివాస్, వేణు, రవి, కిరణ్‌నాయక్, సోమ్‌కుమార్, పూర్ణిమ, హరీష, లావణ్య, స్రవంతి, రజిత, సుజాత పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని నర్సక్కపేటలో సీసీరోడ్డు పనులను బీజేపీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథ కం కింద కేంద్రహోంశాఖ సహాయమంత్రి బం డి సంజయ్‌కుమార్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరుచేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు అనీల్‌కుమార్, నాయకులు దూది సుధీర్‌రెడ్డి, బొల్ల రాంరెడ్డి, మాదవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని గోపాల్‌రావ్ పల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు భూమిపూజ చేశారు. నాయకులు జంగం కిషన్, జీవన్, తోట రాజు, బోల్లం భాస్కర్, మాజీ ఎంపీటీసీ ములి గె దుర్గ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : మండలంలోని నాగారం లో సీసీ రోడ్డు నిర్మాణానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అప్పాల నాగభూషణం శుక్రవారం భూ మిపూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు బాషా జనార్ధన్, బొమ్మెన కిషన్‌రావు, కొమ్ము మల్లయ్య, శంకర్, రాజశేఖర్, బీజేపీ నాయకులు మేకల ప్రదీప్, బాస పవన్, భాస అనిల్, మేకల వంశీ తదితరులు ఉన్నారు.

మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా సంగీత



నియామక పత్రాన్ని అందుకుంటున్న సంగీత

ఎల్లారెడ్డిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బుర్క సంగీత నియమితులయారు. ఈ మేరకు ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ గురువారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, వేణు, పూర్ణిమ, తదితరులు ఉన్నారు.

డబుల్ ఆశలు..

(5వ పేజీ తరువాయి)

కేటగిరీలుగా దరఖాస్తులను విభజించారు. ఎల్ 1లో 4,653 దరఖాస్తులు, ఎల్ 2లో 1,415 దరఖాస్తులు, ఎల్ 3లో 3,287 దరఖాస్తులను గుర్తించి ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. వీటిలో ఎల్ 1లో స్థలం ఉన్నావారు, ఎల్ 2లో సొంత స్థలం లేనివారు, ఎల్ 3లో మరోసారి ఏఐ ద్వారా పరిశీలించడానికి నిర్ణయించారు. ప్రస్తుతం మంజూరీలో 1,085 దరఖాస్తులు అర్హులుగా గుర్తించారు. ఇందులో 112 గ్రౌడింగ్ చేశారు. ఎల్ 1లో అర్హులుగా గ్రౌండింగ్ చేస్తున్న వాటిలో బోయినపల్లి మండలం అనంతపల్లిలో 109, చందుర్తి మండలం కొత్తపేటలో 17, ఇల్లంతకుంట మండలం సిరికొండలో 107, గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో 141, కోనరావుపేట మండలం గొల్లపల్లి(కొలనూర్) 33, ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో 78, రుద్రంగి మండలం గాయిదిగుట్ట తండా 44, తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో 102, వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండా 107, వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లిలో 27, వేములవాడ మండలం శాభాష్‌పల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో 18, ఎల్లారెడ్డిపేట మండలం గుండారం(పాటిచెర్ల) 184, సిరిసిల్ల మున్సిపాలిటీలో పెద్దూర్‌లో 118 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నాలుగు విడతలుగా రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నారు. లబ్ధిదారుల ఎంపికలో తొలి ప్రాధాన్యతగా నిరుపేదలు, దళితులు, గిరిజనులు వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లను ఎంపికచేయనున్నారు. లబ్ధిదారుల్లో దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనార్టీలకు 50 శాతం, జనరల్ కేటగిరీ కింద 15 శాతం చొప్పున ఇళ్లను కేటాయించనున్నారు. ఇంటి నిర్మాణంలో పునాది స్థాయిలో రూ.లక్ష, రెండో దశలో రూ.1.25 లక్షలు, మూడో దశలో స్లాబ్‌కు రూ.1.75 లక్షలు, ఫినిషింగ్, ఇతర దశలకు రూ.లక్ష చొప్పున అందించనున్నారు.

హార్వెస్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్, పక్కన అధికారులు

తంగళ్లపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ యజమానులు నిబంధనలు, వ్యవసాయ శాఖాధికారుల సూచనలు తప్పనిసారిగా పాటించాలని తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మీనారాయణలు సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలో హార్వెస్టర్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖాధికారుల అనుమతి ఉంటేనే వరికోత చేయాలన్నారు. ఏఈవోలు ఆయా గ్రామాల పరిధిలోని పంట కోతకు వచ్చిన రైతులకు టోకన్లు ఇస్తారని దాని ప్రకారం వరికోత చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో ఏవో సంజీవ్, ఏఈవోలు, హార్వెస్టర్ యజమానులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: వరికోతల సమయంలో హార్వెస్టర్ ఆపరేటర్లు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఫారూక్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అవగాహన సమావేశం జరిగింది. ఎంపీడీఓ శశికళ వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డిలతో పాటు ఏఈఓలు, హార్వెస్టర్ యజమానులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలంలోని ఆయా గ్రామాల హార్వెస్టర్ యజమానులతో తహసీల్దార్ ముక్తార్‌పాషా, వ్యవసాయ అధికారి కుమారి జయ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పొలాలను కోసే విధానంపై పలు సూచనలు చేశారు. రైతులకు హార్వెస్టర్ యజమానులు సహకరించాలని కోరారు.

● గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట) : గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో హార్వెస్టర్ యజమానులు, వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీవో రాజేశ్వర్, ఏవో సలావుద్దిన్, ఏపీఎం సుదర్శన్, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

చందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలో ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు రూ.3కోట్ల77 లక్షల 30 వేల ఖర్చుతో వివిధ రకాల పనులు చేసినట్లు అధికారుల వెల్లడించారు. డీఆర్‌పీలు మాట్లాడుతూ పలు గ్రామాల్లో కార్యదర్శుల సంతకాలు లేకుండానే పేమెంట్ చేశారన్నారు. ఎనగల్ గ్రామంలో భార్యభర్తలకు వేర్వేరుగా ఇద్దరికి జాబ్ కార్డులు ఇచ్చారన్నారు. ఒకరి పేరు మీద జాబ్ కార్డు రద్దు చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో కొలతలు సక్రమంగా చేయలేదన్నారు. మస్టర్లలో కూలీల సంతకాలు, రికార్డులు సక్రమంగా నిర్వహణ లేదని ఈజీఎస్ సిబ్బందికి రూ.55,392 రికవరీ, రూ.11,000 పెనాల్టీ వేశారు. డీఆర్‌డీవో బి.శేషాద్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణ్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ రాకేష్, ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, ఏపీవో రాజయ్య, టీఏలు, గ్రామకార్యదర్శులు, ఎఫ్ఏలు, ఎస్ఆర్‌పీలు, కార్యదర్శులు, ఫీల్డ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● సిరిసిల్ల కలెక్టరేట్ : జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఎల్లారెడ్డిపేట సింగిల్ విండోచైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పెద్దూర్ సింగిల్‌విండోచైర్మన్ జీల కిషన్‌యాదవ్, ఇల్లంతకుంట సింగిల్ విండోచైర్మన్ తిరుపతిరెడ్డి, కోరెం సింగిల్ విండో చైర్మన్ కిషన్‌రెడ్డి కోరారు. కలెక్ట రేట్‌లో గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి సింగిల్ విండోల ఆధ్వర్యంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని కోరారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్సీ బీసీల విజయోత్సవ సభను నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి సమక్షంలో మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభను నిర్వహించారు. విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, కొండం రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, దీటి నర్సింలు, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు

● ఎల్లారెడ్డిపేట :ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని వివిధ కుల సంఘాలు, రైతుల ఆధ్వర్యంలో గురువారం మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో దున్నపోతును డప్పుచప్పుళ్ల నడుమ గ్రామ పురవీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. రైతులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట) : రాజమండ్రిలోని కొంతమూరు సమీపంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం గురువారం డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చంద్రం కోరారు.

● గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట): గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు 'శతక సాహిత్యం-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై విస్తృత ఉపన్యాస సదస్సును గురువారం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ దాసు, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీవో ధర్మపురి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ వాణి, తెలుగు విభాగం అధ్యాపకులు దీపిక, భార్గవి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ అంజనేయులు, టాస్క్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రవణ్, అధ్యాపకులు ఆది విష్ణు, బిక్షమయ్య, మనోహర్, శ్రీనివాస్, మహేశ్, కృష్ణప్రసాద్, శైలజ, జగన్నాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న వరి ధాన్యం కొనుగోళ్లను మహిళా సంఘాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల మహిళలతో గురువారం సమావేశం నిర్వహించారు. సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, మహిళలు పాల్గొన్నారు.

● వేములవాడ : రంజాన్ సమీపిస్తున్న నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం సుమారు 150 మంది మహిళలకు బీజేపీ సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోల కిష్టస్వామి, పట్టణ శాఖ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని జామా మసీదులో మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ గురువారం ముస్లింలకు ఇఫ్తారు విందు ఇచ్చారు. నయిం, అజీం, ఆసిఫ్‌రజా, మునీర్, బాబా, ఫయిం, సద్దాం, మొబీన్, తాజ్, ఇమ్రాన్, జావెద్, హబీబ్, అశు, సోహెల్, సలావొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లె గ్రామంలో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మీరాల శ్రీనివాస్ యాదవ్, కడారి సునీల్‌రెడ్డి, కూతురి రాజు, ఎడ్ల ప్రేమ్‌కుమార్, కొండవేని రవి తదితరులు పాల్గొన్నారు.